క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు బట్టేపాడు విద్యార్థిని


అర్చన

ఆత్మకూరురూరల్ : చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగిన కుస్తీ పోటీల్లో ఆత్మకూరు మండలం బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అర్చన స్వర్ణ పతకం సాధించారని పాఠశాల పీడీ కేవీ కృష్ణయ్య మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికై నట్లు ఆయన తెలియజేశారు. ఈ మేరకు ప్రతిభ చూపిన బాలికను మంగళవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు.

అర్జీల స్వీకరణ



చేజర్ల : మండలంలోని యనమదల గ్రామ సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.మస్తానయ్య రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ నోటి సుందరరామిరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సోము వెంకటేశ్వర్లు, సర్వేయర్లు రాధాకృష్ణ, సురేష్‌బాబు, వీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏసీఎస్సార్ కాలనీలో వైద్యసేవలు

ఆత్మకూరు : 19వ వార్డు పరిధిలోని ఏసీఎస్సార్ కాలనీలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులు అందజేశారు. మురుగునీటి గుంతల్లో మందులను పిచికారీ చేయించారు. కాలనీలో 7, 8 మంది జ్వరాలతో ఉన్నట్లు గుర్తించి కొందరిని ఆస్పత్రికి పంపడం, మరికొందరికి ఇంటి వద్దనే చికిత్స కోసం మందులు అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, ఆశా కార్యకర్త అనిత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



ఆత్మకూరురూరల్ : మండలంలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన పంచాయతీరాజ్ ఉద్యోగులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వరికుంటపాడు: మండలంలోని విరువూరు పంచాయితీ కోటవర్ధినిపల్లె సమీపంలో మోటార్ బైక్ అదుపు తప్పడంతో సచివాలయ సిబ్బంది గాయపడిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ప్రభుదాస్ వేంపాడు సచివాలయ కార్యదర్శిగా, విరువూరు సచివాలయ ఇన్‌చార్జి డీడీఓగా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వాహణలో భాగంగా నార్తు కొండాయపాళేనికి పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. కోటవర్ధినిపల్లి సమీపంలో ఎదురుగా వాహనం రావడంతో తప్పించబోయి బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో ప్రభుదాస్ గాయపడగా అంబులెన్స్‌లో పామూరు వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్సై రఘునాథ్ తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

సీతారామపురం : రైతు సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకూరు ఆర్డీఓ పావని అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలన్నారు. అనంతరం సింగారెడ్డిపల్లిలో జరుగుతున్న గ్రామసభలో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అలాగే స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ కృష్ణారెడ్డి ఉన్నారు.

అంతా మా ఇష్టం

- నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణాలు
- మంజూరు ఒకచోట, నిర్మాణం మరోచోట


టీడీపీ నేత వెంగళరెడ్డి ఇంటి వద్ద నిబంధనలకు విరుద్ధంగా వేసిన విశాలమైన సిమెంటు రోడ్డు

దుత్తలూరు : కూటమి ప్రభుత్వంలో పచ్చ నేతలు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా పాలన సాగుతోంది. ప్రజలు, ప్రజాప్రతినిధులతో సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో అధికారులు సైతం తల్లడిల్లుతున్నారు. మండలంలోని జంగాలపల్లిలో జరిగిన రోడ్డు నిర్మాణ పనుల్లో టీడీపీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బైరవరం పంచాయతీలోని జంగాలపల్లిలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేసి పనులు కూడా మంజూరయ్యాయి. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయాయి. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. అయితే టీడీపీ నాయకులకు నిర్మాణ బాధ్యతలు అప్పజెప్పడంతో వారి ఇష్టప్రకారం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలోని మూడు వీధుల్లో రూ.6 లక్షలతో, రూ.5.5 లక్షలతో, రూ.3 లక్షలతో సిమెంటురోడ్లు నిర్మించాల్సి ఉండగా వీటిని మంజూరు ప్రదేశాల్లో కాకుండా వారి ఇష్టానుసారంగా వేసుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి వెంగళరెడ్డి తన ఇంటి చుట్టూ ఆరు మీటర్లకు పైగా వెడల్పు ఉండేలా రోడ్డు నిర్మించుకొని ప్రజాధనాన్ని వృథా చేశాడని ఉపసర్పంచ్ అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి అంటున్నారు.

నిబంధనలు తుంగలో..

పంచాయతీ తీర్మానం ప్రకారం రోడ్డు పనులు చేయించాలని స్థానిక పంచాయతీరాజ్ అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడంతో టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ తాను ఆడిందే ఆటగా, పాడిందే పాటగా నిర్మాణాలు చేపట్టి నిధులు కాజేశారు. ఇలా పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా ఉపాధిహామీ నిధులతో పనులు చేపట్టడం, కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం నాయకులకు వారి ఇళ్ల ముందు సిమెంటురోడ్డు నిర్మించుకోవడానికేనా అని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ బలం నేపథ్యంలో అధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ, డ్వామా పీడీ, ఏపీడీ, పంచాయతీరాజ్ ఈఈ, పంచాయతీరాజ్ డీఈలకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తెలిపారు.


అవసరం లేనిచోట రోడ్డు వేశారని చూపుతున్న ఉపసర్పంచ్

ఇష్టానుసారంగా నిర్మించారు

పంచాయతీ తీర్మానం ప్రకారం పనులు చేపట్టలేదు. మాజీ సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ నేత అయిన అన్నపురెడ్డి వెంగళరెడ్డి ఇంటి చుట్టూ సిమెంటురోడ్డు నిర్మాణం చేపట్టారు. వెంటనే సదరు రోడ్ల నిర్మాణాలకు నిధులు నిలిపివేసి పంచాయతీ తీర్మానం ఉండే ప్రదేశాల్లోనే సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్, భైరవరం

అధికారులు చర్యలు చేపట్టాలి



ఉన్నతాధికారులు జంగాలపల్లిలో జరిగిన రోడ్డు పనులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలి. గతంలో మంజూరైన చోట కాకుండా మరోచోట నిబంధనలకు విరుద్ధంగా వేయడం తగదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– రవణమ్మ, సర్పంచ్, భైరవరం

పక్కాగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

సీతారామపురం : జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను వైద్యసిబ్బంది పక్కాగా నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తెలిపారు. ఆయన మంగళవారం సీతారామపురం పీహెచ్‌సీని తనిఖీ చేసి కేన్సర్ పరీక్షలపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ముందస్తు పరీక్షలతో కేన్సర్‌ను దూరం చేయవచ్చన్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్షించారు, వైద్యులు స్వప్నారెడ్డి, భవ్యశ్రీ, సిబ్బంది విజయ్, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎస్‌పీఎస్ మురళి పాల్గొన్నారు.

- దుత్తలూరు : దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాన్పుల గది, మందుల స్టాకు, వార్డులు, నిర్మాణం పూర్తయిన ల్యాబొరేటరీ భవనాన్ని పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు వైద్యశాలలో అందిస్తున్న వివిధ సేవల గురించి ఆరా తీశారు. కో–ఆర్డినేటర్ విజయ్, వైద్యాధికారి అయూబ్ అఫ్సర్, సీహెచ్‌ఓ ఓంకారయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.


సీతారామపురం : మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

- ఉదయగిరి : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ అన్నారు. గండిపాళెం ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వైద్యులు శివకల్పన, అయూబ్ ఉన్నారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు జోరు వర్షంలోనూ మ్యాచ్‌లు జరిగాయి. ఆర్గనైజర్ పీడీ తిరుపతయ్య నేతృత్వంలో సాగిన పోటీల్లో నెల్లూరు జిల్లా అండర్ – 19 బాలికల జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ముగింపు సభలో విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.గోపాల్, ఆర్‌ఐపీఈ (గుంటూరు) ఎస్కే మహబూబ్‌బాషా, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.గురుప్రసాద్, పీడీ, పీఈటీల అసోసియేషన్ కార్యదర్శులు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, పి థామస్ పీటర్, ఎస్.విజయ, అబ్జర్వర్లు కె.రెడ్డయ్య, ఎస్కే జరీనా, పి.తిరుపతయ్య, వివిధ జిల్లాల్లోని పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.


అండర్ - 19లో రన్నర్స్‌గా నిలిచిన నెల్లూరు జిల్లా బాలికల జట్టుకు ట్రోఫీ ప్రదానం


రైతులకు శిక్షణ

అల్లూరు : స్థానిక మండల కార్యాలయంలో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజాకుమారి మాట్లాడారు. ప్రతి రైతు విత్తన శుద్ధిని చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని తెలియజేశారు. అల్లూరు ఏఓ శ్రీహరినారాయణ పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల తనిఖీ

వరికుంటపాడు : మండలంలోని తూర్పుబోయమడుగుల, కాంచెరువు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలను మండల ఏఓ వి.రవికుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వీఏఏలు ఆదిత్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం



ఉదయగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి అన్నారు. కళాశాలలో వారం పాటు జరిగే నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ వారంలో విద్యార్థులకు విద్య, వృత్తిపరమైన వివిధ అంశాలపై మెళకువలు నేర్పిస్తారన్నారు. అధ్యాపకులు గోపీకృష్ణ, రఘునాథరెడ్డి, జి.రమేష్, శోభ, అశోక్, హరీష్, క్రాంతి పాల్గొన్నారు.

మోస్తరు వర్షం


కొండాపురం: పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు

ఆత్మకూరు : అల్పపీడన ప్రభావంతో ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో మంగళవారం మోస్తరు వర్షాలు కురిశాయి. పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో గడిచిన 24 గంటల్లో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 14.2 మిల్లీమీటర్లు నమోదైంది. మర్రిపాడు 1.2, చేజర్ల 10.2, ఏఎస్‌పేట 8.8, అనంతసాగరం 1.2, సంగం 9.4, కలువాయి 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

29.2 మిల్లీమీటర్ల వర్షం

కొండాపురం : మండల పరిధిలో మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు 29.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పంట పొలాలు, చిన్న గుంతలు, వాగుల్లో వర్షపునీరు చేరాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లు రొచ్చురొచ్చుగా మారాయి. పొగాకు రైతులు నాట్లు వేసేందుకు కొంతమేర ఇబ్బందులు పడ్డారు.

- జలదంకి: మండలంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మోస్తరు వర్షం పడింది. గ్రామాల్లోని రహదారులు బురదమయంగా మారాయి. కావలి కాలువ చివరి ఆయకట్టు రైతులకు వర్షంతో కొంత ఊరట లభించింది.
- అల్లూరు : అల్లూరు మండల వ్యాప్తంగా మంగళవారం వేకువజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. రోడ్లపై నీరు చేరడంతో వాహనచోదకులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- చేజర్ల : మండలంలోని చేజర్ల, మాముడూరు, ఆదూరుపల్లి, పెరుమాళ్లపాడు, మడపల్లి, యనమదల, తూర్పుపల్లి గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి జడివాన కురిసింది. వర్షం వల్ల రైతులు 15 రోజుల తర్వాత నార్లు పోసుకునేందుకు సిద్ధపడుతున్నారు.
- సంగం : మండల పరిధిలో మంగళవారం తెల్లవారుజాము 3 నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సంగం పట్టణంతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- కలిగిరి : మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీగా వర్షం పడింది. దీంతో చెరువులకు నీరు చేరింది. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయమైంది.
- వరికుంటపాడు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షపు జల్లులు పడుతున్నాయి. మండల కేంద్రంలో సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది.


చేజర్ల : ఆదూరుపల్లిలో కురుస్తున్న జోరు వర్షం

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వరికుంటపాడు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తామని మండల వైద్యాధికారిణి కరీష్మా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, ఆశా కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి గురు, శనివారాల్లో పాఠశాలలను సందర్శించి రోజుకు 30 మంది విద్యార్థులను పరీక్షించి ఆ సమాచారాన్ని ఆరోగ్య కార్డులో నమోదు చేస్తారన్నారు.

కేన్సర్ లక్షణాల గుర్తింపు సర్వే

ఈనెల 14వ తేదీ నుంచి ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కేన్సర్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించే సర్వే చేస్తామని తెలిపారు. సిబ్బంది రోజుకు ఐదు గృహాలను సందర్శిస్తారన్నారు.

జయప్రదం చేయాలి

ఆత్మకూరురూరల్ : పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం చేపట్టే ఆందోళన, ధర్నాను ప్రజలు జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి ధర్నా ప్రారంభమవుతుందన్నారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎం నేడు

కావలి : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, సూచనలను 99592 25643 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

ఆత్మకూరు పరిధిలో..

ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా మంగళవారం తెలిపారు. ప్రజలు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 99592 25645 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని కోరారు.

15న హనుమత్ క్షేత్రంలో విశేష పూజలు

కావలి : పట్టణంలోని ముసునూరు వద్ద ఉన్న హరిహర సహిత హనుమత్ క్షేత్రంలో నవంబర్ 15న (శుక్రవారం) విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకుడు వేదగిరి సూర్యనారాయణాచార్యులు మంగళవారం తెలిపారు. సహస్ర లింగేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 108 శివలింగాలకు సామూహిక రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. పాల్గొనే భక్తులు 77994 30044, 81212 11793 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

17న కొండ బిట్రగుంటలో శంకుస్థాపన

కావలి : కొండ బిట్రగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఆలయ ప్రాకారం (ప్రహరీ), గాలిగోపురం నిర్మాణానికి ఈనెల 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు శంకుస్థాపన చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. కర్ణాటక శారదాపీఠం పీఠాధిపతి విధుశేఖర భారతి సన్నిధానం పాల్గొనే కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సకాలంలో పూర్తి చేయాలి

వరికుంటపాడు : సిమెంట్ రోడ్డు పనులను సకాలంలో పూర్తిచేయాలని ఉదయగిరి పంచాయతీరాజ్ కార్యాలయ డీఈ ఫణికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కాంచెరువు, నల్లబోతులవారిపల్లె గ్రామాల్లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఏఈ రవీంద్రనాథ్, సిబ్బంది రమణయ్య ఉన్నారు.

- ఉదయగిరి : మండలంలోని కొండాయపాళెం, మాసాయిపేట గ్రామాల్లో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను పంచాయతీరాజ్ డీఈ ఫణికుమార్ మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని సూచించారు. ఏఈ శ్రీనివాసరాజు ఉన్నారు.

జీపీడీపీపై శిక్షణ రేపు

సీతారామపురం : 2025–26 సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సీతారామపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీరాజ్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికార యంత్రాంగం విధిగా హాజరుకావాలన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల మృతి

కావలి : కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ రెడ్డిపాళెంలో మంగళవారం పిడుగుపాటుకు 11 గొర్రెలు మృతిచెందాయి. నక్కా రామచంద్రయ్య గొర్రెలను మేపడానికి పొలాల్లోకి తీసుకెళ్లాడు. గొర్రెలు మేత మేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి.

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి) : గ్రామాల ప్రగతికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు కలిసి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమన్నారు. మండలంలో తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశామని, వీటి ద్వారానే అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, సీడీపీఓ పద్మాజాకుమారి, ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఆత్మకూరురూరల్ : గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిద్దామని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం జరిగిన శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. ఏఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, చిన్న మస్తాన్, డిజిటల్ అసిస్టెంట్‌లు వేణు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



వరికుంటపాడు : వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లోని శివాలయాల్లో మంగళవారం చిలుకు ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లి, కాంచెరువు, వరికుంటపాడు, గండిపాళెం, ఉదయగిరి, ఆర్లపడియ, లింగాలదొన తదితర శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివెళ్లి పరమేశ్వరునికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

సోమశిల : అనంతసాగరం మండలంలోని రేవూరు, మినగల్లు గ్రామాల్లో వ్యవసాయాధికారి పి.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వీహెచ్‌ఏ వెంకటేశ్వర్లు, వీఏఏ లక్ష్మి పాల్గొన్నారు.

- మర్రిపాడు : మండలంలోని చిన్నమాచనూరు, రామానాయుడుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏఓ రామ్మోహన్ తెలిపారు. చిన్నమాచనూరులో నారుమడిని పరిశీలించి పలు సూచనలు చేశారు. వీఏఏలు షాజియా, మల్లిక పాల్గొన్నారు.
- సీతారామపురం : మండలంలోని సీతారామపురం, నారాయణప్పపేట గ్రామాల్లో మండల ఏఓ చెన్నారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈఓ సాంబశివయ్య, వెటర్నరీ అసిస్టెంట్ మాలాశ్రీ, వీఏఏలు హాజిరా, వెంకటేశ్వర్లు ఉన్నారు.
- చేజర్ల : మండలంలోని పాతపాడు, పెరుమాళ్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శశిధర్ రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏ బ్రహ్మేంద్ర ఉన్నారు.

15 వరకు శిబిరాలు

ఆత్మకూరురూరల్ : గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా కొత్త ఖాతాలు తెరవడంతో పాటు ఆధార్ లింకేజీని సులభతరం చేయడానికి ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు సబ్ డివిజన్ ఉప తపాలాధికారి మహమ్మద్ హుస్సేన్ అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఈనెల 15 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఆక్రమిస్తే చర్యలు

ఉదయగిరి : పోలీస్ శాఖకు సంబంధించిన ఆస్తులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ ఎస్.వెంకట్రావు హెచ్చరించారు. పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలో ఉన్న పాత పోలీస్ క్వార్టర్స్‌ను ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డితో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. త్వరలో అధికారులతో సర్వే చేయించి కంచె ఏర్పాటు చేస్తామన్నారు.

భవన నిర్మాణాలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

వింజమూరు(ఉదయగిరి) : ప్రస్తుతం జిల్లాలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను వంద రోజుల్లో పూర్తి చేసేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు హౌసింగ్ పీడీ పి.వేణుగోపాల్ అన్నారు. వింజమూరులో మంగళవారం సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, హౌసింగ్ సిబ్బందితో అవగాహన కార్యక్రమం జరిగింది. రోజువారీ పురోగతిపై ఎలాంటి ప్రణాళికలు అమలు చేయాలో తగిన సూచనలు అందించారు. కావలి హౌసింగ్ ఈఈ మాధవరావు, ఏఈ ఫిరాన్ పాల్గొన్నారు.

ఆనకట్ట పనులు పూర్తిచేస్తాం

ఉదయగిరి : ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తామని ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు అన్నారు. ఆనకట్ట పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. డీఈ కె.చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

సీతారామపురం : స్థానిక బిట్–1 సచివాలయాన్ని ఎంపీడీఓ భాస్కర్, ఈఓపీఆర్డీ భార్గవి మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు.